https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 AM TO 10 AM

సంపుటి: 01 / సంచిక:32 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / గురువారం, సెప్టెంబర్ 17,2026




## F-15 జీవ: సౌదీ ఎఫ్-15 యుద్ధ విమానం కూల్చివేత..

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17

సనా: సౌదీ అరేబియాకు చెందిన ఎఫ్-15 యుద్ధ విమానాన్ని .. యెమెన్‌లోని హౌతీలు కూల్చివేశారు. స్థానికంగా తయారు చేసిన ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్‌తో ఆ ఫైటర్ జెట్‌ను షూట్ చేసినట్లు చెప్పారు. శత్రు ఆపరేషన్స్ చేపడుతున్న సమయంలో దాన్ని కూల్చినట్లు పేర్కొన్నారు. మారిబ్ ప్రావిన్సులో ఆ విమానం కూలినట్లు హౌతీ మిలిటరీ ప్రతినిధి యాహ్యా సారే తెలిపారు. సౌదీ ఎఫ్-15 జెట్ కూల్చివేతకు చెందిన వీడియోను హౌతీలు రిలీజ్ చేశారు. రాత్రి వేళ ఆ యుద్ధ విమానాన్ని నేలకూల్చారు. ఇక దాని శిథిలాలను మారిబ్ ప్రావిన్సులో గుర్తించారు. సుమారు నాలుగు నిమిషాలు ఉన్న ఓ వీడియోను హౌతీలు రిలీజ్ చేశారు. జెట్‌ను టార్గెట్ చేసిన క్షణం నుంచి కింద పడి మంటలు, పొగ వ్యాపిస్తున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. కొండలతో ఉన్న ఎడారి ప్రాంతంలో ఆ జెట్ పడింది. ఆ విమానం రెక్కపై సౌదీ ఎయిర్‌క్రాఫ్ట్ అని రాసి ఉన్నది. ఆయుధాలు కలిగి ఉన్న వ్యక్తులు కొందరు ఆ విమాన శిథిలాల వద్దకు చేరుకున్నారు.

# బీజేపీతో పొత్తుండదు..

## దామాషా ప్రకారం సీట్లు పెంచితేనే డీలిమిటేషన్‌కు బీఆర్ఎస్ మద్దతు

- ఏఐని సానుకూలంగా స్వీకరించాలి
- కాళేశ్వరం ప్రాజెక్టు, ఉచిత విద్యుత్తుతో తెలంగాణలో రికార్డు స్థాయి ధాన్యం
- 'సైరూట్ ఏరోస్పేస్'.. తెలంగాణ ఇన్నోవేషన్ విజయానికి నిదర్శనం
- 'స్టార్టప్ స్టేట్ తెలంగాణ'పై ఓపీ జిందాల్ గ్లోబల్ వర్సిటీలో కేటీఆర్ కీలకోపన్యాసం

**తెలంగాణలో టీ-హబ్, వీ-హబ్, టీ-వర్క్స్, టాస్ వంటి సంస్థలు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, యువతకు ఉద్యోగ నైపుణ్యాలు కల్పించడంలో విప్లవాత్మక మార్పులు తెచ్చినయ్. ఇంక్యుబేషన్ దశ నుంచి స్వదేశీ రాకెట్లను ప్రయోగించే స్థాయికి ఎదిగిన 'సైరూట్ ఏరోస్పేస్' తెలంగాణ ఇన్నోవేషన్ వ్యవస్థ విజయానికి తిరుగులేని నిదర్శనం.**



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17 :

రాబోయే 2028 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో బీజేపీతో ఎలాంటి పొత్తు పెట్టుకోబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. హర్యానాలోని సోనిపట్‌లో ప్రఖ్యాత ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో బుధవారం 'ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్: ది స్టోరీ ఆఫ్ ఏ స్టార్టప్ స్టేట్' అనే అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ.. 'బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదు' అని స్పష్టమైన ప్రకటన చేశారు. డీలిమిటేషన్‌పై అడిగిన మరో ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ప్రాతినిధ్యం ఉందని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను దామాషా ప్రకారం పెంచితేనే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యానికి అన్యాయం జరుగదని పేర్కొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవం..

## జాతీయ జెండా ఆవిష్కరించిన సీఎం రేవంత్




హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17:

ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో పబ్లిక్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.అటు తెలంగాణ అసెంబ్లీలోనూ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ, అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు హాజరయ్యారు.

### ఉదంపూర్ ఎన్‌కౌంటర్‌లో

# ఇద్దరు ఉగ్రవాదులు హతం..

### కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్



శ్రీనగర్: ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17

జమ్మూకశ్మీర్‌లోని ఉదంపూర్ జిల్లలో ఇవాళ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతం అయ్యారు. ఉదంపూర్ జిల్లాలోని మజాల్తాలో అనుమానాస్పద కదలికలు ఉన్నట్లు బుధవారం సాయంత్రం అధికారులకు సమాచారం అందింది. దీంతో సంయుక్త బలగాలు ఆ ప్రదేశంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఆ తర్వాత ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. గన్‌ఫైట్ సమయంలో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు చెప్పారు.అయితే హతమైన ఉగ్రవాదుల ఐడెంటిటీ ఇంకా తెలియాల్సి ఉన్నది. జమ్మూకశ్మీర్ పోలీసులు, స్పెషల్ పారాట్రూపర్లు తొలుత సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. ఎన్‌కౌంటర్ స్టార్ట్ కావడంతో ఆ ప్రదేశానికి అదనపు బలగాలు హుటాహుటిన చేరుకున్నాయి. ఇండియన్ ఆర్మీ, సీఆర్పీఎఫ్, జేకే పోలీసు ఎస్ఓజీ కూడా సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ఇటీవల పిర్ పంజల్ ప్రాంతంలో లష్కరే తోయిబాకు చెందిన ఓ అండర్‌గ్రౌండ్ నెట్వర్క్‌ను గుట్టు విప్పిన నేపథ్యంలో అక్కడ భద్రతను పెంచారు. పిర్ పంజాల్ ప్రాంతంలో టెర్రర్ మాడ్యూల్ నడిపిస్తున్న ముగ్గురు వ్యక్తులను సెప్టెంబర్ 15వ తేదీన అదుపులోకి తీసుకున్నారు.

## రష్యాపై ఆంక్షల బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం..

# భారత్‌కు పొంచి ఉన్న 100 శాతం టారిఫ్ ముప్పు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17

న్యూయార్క్: అమెరికా కీలక బిల్లును పాస్ చేసింది. రష్యాపై ఆంక్షలు విధించే బిల్లుకు చట్టసభ ప్రతినిధుల సభలో ఆమోదం దక్కింది. బుధవారం జరిగిన ఓటింగ్‌లో అనుకూలంగా 262, వ్యతిరేకంగా 159 మంది ఓటేశారు. పాసైన బిల్లు ఇప్పుడు అధ్యక్షుడు ట్రంప్ ముందుకు వెళ్తుంది. ఇప్పటికే ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ట్రంప్‌కు ఇప్పుడు మరింత శక్తి తోడైనట్లు అయ్యింది. దక్షిణ కరోలినా దివంగత సేనేటర్ లిండ్సే గ్రహం గౌరవార్థం ఈ బిల్లును రూపొందించారు. సుమారు ఏడాది పాటు ఆ బిల్లుపై చర్చలు జరిగాయి.రష్యాపై ఆర్థిక ఆంక్షల బిల్లుకు ఆమోదం దక్కడం అంటే, ఆ ప్రభావం భారత్, చైనా దేశాలపై పడే అవకాశాలు ఉన్నాయి. రష్యా వద్ద ఇంధనం ఖరీదు చేస్తున్న దేశాలపై వంద శాతం సుంకం విధించనున్నట్లు గతంలో ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇక ఇప్పుడు రష్యా ఆంక్షల బిల్లుకు ఆమోదం దక్కింది కాబట్టి, భారత్‌తో పాటు చైనాపై అమెరికా అధ్యక్షుడు తన అధికారాన్ని ప్రదర్శించే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే సభలో డెమోక్రాట్లు ఆ బిల్లును వ్యతిరేకించారు. ట్రంప్ అధికారాలూ ఎక్కువైపోతాయని ఆరోపించారు.రష్యా నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని సరఫరా చేసుకుంటున్న దేశాలపై 100 శాతం టారిఫ్ విధించే అవకాశాలు ఉన్నాయి. ఒక 15 శాతం కన్నా తక్కువ స్థాయిలో రష్యా సహజ వాయువులను దిగుమతి చేసుకునే దేశాలపై తక్కువ సుంకం విధించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రష్యా నుంచి భారత్ ఎక్కువగానే ఇంధానాన్ని దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో..

# యూపీఐ చార్జీలు..

## కేంద్రానికి మద్దతుగా నిలిచిన కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17



పర్సన్ టు మర్చంట్ యూపీఐ పేమెంట్లపై 0.4 శాతం చార్జీ వసూలు చేయడాన్ని జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా సమర్థించారు. యూపీఐ యాప్‌లు వాడే ప్రతిఒక్కరిపై చార్జీల భారం పడదని, లావాదేవీలు రూ.2 వేలు దాటితేనే చార్జీ పడుతుందని ఆయన పేర్కొన్నారు. అదికూడా వ్యాపారి చెల్లిస్తాడని, సాధారణ వినియోగదారుడు చెల్లించడని చెప్పారు.

మొదటిపేజీ తరువాయి

## యూపీఐ చార్జీలు.. కేంద్రానికి మద్దతుగా నిలిచిన కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

గురువారం శ్రీనగర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. పర్సన్ టు పర్సన్ చెల్లింపులన్నీ పూర్తిగా ఉచితమని గుర్తుచేశారు. 'యూపీఐ యాప్‌లను వాడే ప్రతిఒక్కరూ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఆ యాప్‌ల ద్వారా చేసే ప్రతి చెల్లింపునకు వినియోగదారుడిపై భారం పడదు. వ్యాపారి నుంచి మాత్రమే మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) ను వసూలు చేస్తారు. దేశవ్యాప్తంగా యూపీఐ లాంటి వ్యవస్థలను నడపాలంటే చాలా డబ్బు కావాలి. ఇప్పటి వరకూ అలాంటి వ్యవస్థను మనమంతా ఫ్రీగా ఉపయోగించాం. యూపీఐ సిస్టమ్ నడపడం అంత సులభం కాదు. చీప్ కూడా కాదు. మనకు ఉచితంగా దొరికే వాటి విలువను మనం అర్థం చేసుకోం' అని ఒమర్ పేర్కొన్నారు.

### సాధారణ వినియోగదారులపై భారం పడకుండా చూడాలి

యూపీఐ యాప్‌లు వాడే సాధారణ వినియోగదారులపై భారం పడకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఒమర్ అబ్దుల్లా కోరారు. 'కంపెనీలను చార్జి చేస్తే నాకెలాంటి అభ్యంతరం లేదు. ఎందుకంటే, కంపెనీలు వ్యాపారం చేసి చాలా డబ్బు గడిస్తాయి' అని ఒమర్ అన్నారు. కాగా.. ఎండీఆర్ చార్జీలు వసూలు చేయడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తరుణంలో ఆ పార్టీ మిత్రపక్ష నేత ఒమర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అంతకుముందు కూడా వందేమాతరం మొత్తం చరణాలను ఆలపించడంపై కాంగ్రెస్ నేతలు అభ్యంతరం చేసిన విషయం తెలిసిందే.

## తెలంగాణకు భారీ వర్ష సూచన..

### ఐదు రోజుల పాటు దంచికొట్టనున్న వానలు!

శనివారం నుంచి ఐదు రోజుల పాటు భారీ వర్షాలు

హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ

గురు, శుక్రవారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు

ఈ సీజన్‌లో రాష్ట్రంలో ఇప్పటికీ 19 శాతం వర్షపాత లోటు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

త్రినేట్ న్యూస్, సెప్టెంబరు17

తెలంగాణలో రుతుపవనాలు మళ్లీ చురుగ్గా మారాయి. రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. శనివారం (19వ తేదీ) నుంచి వర్షాల తీవ్రత పెరగనుందని తెలిపింది. గురు, శుక్రవారాల్లో కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో దాదాపు అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.ఐఎండీ హెచ్చరికల ప్రకారం.. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్-మల్కాజిగిరి, ములుగు, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి.రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం వరకు ఈదురుగాలులు, ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయని అధికారులు తెలిపారు. వాతావరణ నిపుణుడు టి.బాలాజీ సైతం తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా సెప్టెంబర్ 17, 18 తేదీల్లో రాత్రి, తెల్లవారుజామున తీవ్రమైన ఉరుములతో కూడిన వర్షాలు పడతాయని అంచనా వేశారు. నగరంలో రాత్రిపూట మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రంలో వర్షపాతం లోటు కొనసాగుతోంది. ఇప్పటివరకు తెలంగాణలో సాధారణంగా 664.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 536.5 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. ఇది 19 శాతం లోటును సూచిస్తోంది. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలో అత్యధికంగా 42 శాతం వర్షపాతం తక్కువగా నమోదైంది. హైదరాబాద్‌లోనూ సాధారణ వర్షపాతం 550.8 మి.మీ. కాగా, ఇప్పటికి 432 మి.మీ. మాత్రమే కురిసింది. రానున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తలు

మొదటిపేజీ తరువాయి

## బీజేపీతో పొత్తుండదు..

ఆ దామాషా ప్రకారం సీట్ల పెంపు జరిగితే డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడానికి బీఆర్ఎస్‌కు ఎలాంటి అభ్యంతరం ఉండదని తెలిపారు. అంతకుముందు తెలంగాణ ఆవిర్భావం నుంచి సాధించిన ప్రగతి, పాలనా సంసరణలు, వినూత్న ఆలోచనల అమలుపై ఆయన విస్తృతతంగా వివరించారు.స్థానిక వార్తలు

### ఏఐని స్వీకరించి ముందుకు సాగాల్సిందే

కృత్రిమ మేధస్సు (ఏఐ), సాంకేతిక మార్పులపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ ఆసక్తికర సమాధానాలు ఇచ్చారు. గతంలో కంప్యూటర్లు, ఇంటర్నెట్ వచ్చినప్పుడు కూడా వ్యతిరేకత వచ్చిందని, ఇప్పుడు ఏఐ విషయంలోనూ అదే జరుగుతున్నదని అన్నారు. సాంకేతిక మార్పులను అడ్డుకోలేమని, ఏఐని సానుకూలంగా స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు.

### తెలంగాణ ఒక స్టార్టప్ స్టేట్

తెలంగాణ రాష్ట్రాన్ని ఒక స్టార్టప్ స్టేట్‌గా అభివర్ణించిన కేటీఆర్, అభివృద్ధి ప్రస్థానాన్ని 'నిర్దిష్టత (సర్టెనిటీ), అవకాశాలు (పాజిబులిటీ)' అనే రెండు సిద్ధాంతాల ద్వారా వివరించారు. తెలంగాణలో స్టార్టప్ సంస్కృతిని బలోపేతం చేసేందుకు చేపట్టిన టీ-హబ్, వీ-హబ్, టీ-వర్క్స్, టాస్క్ వంటి సంస్థల పనితీరును కేటీఆర్ ప్రస్తావించారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, ప్రోటోటైపింగ్, హార్డ్‌వేర్ నమూనాలు రూపొందించడం, యువతకు ఉద్యోగ నైపుణ్యాలు కల్పించడంలో ఇవి విప్లవాత్మక మార్పులు తెచ్చాయని చెప్పారు. సాధారణ ఇంక్యుబేషన్ దశ నుంచి స్వదేశీ రాకెట్లను ప్రయోగించే స్థాయికి ఎదిగిన 'స్కైరూట్ ఏరోస్పేస్' తెలంగాణ ఇన్నోవేషన్ వ్యవస్థ విజయానికి తిరుగులేని నిదర్శనమని గుర్తుచేశారు.

### సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు

తెలంగాణ సాధించిన ప్రగతిలో సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు రంగాలు కీలకపాత్ర పోషించాయని కేటీఆర్ వివరించారు. చారిత్రకంగా దశాబ్దాలపాటు కరువుతో అల్లాడిన తెలంగాణ ప్రాంతానికి గోదావరి జలాలను తరలించే సవాలుకు కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ పరిష్కారంగా నిలిచిందని వివరించారు. 201415లో తెలంగాణలో వరి ధాన్యం ఉత్పత్తి కేవలం 44.4 లక్షల టన్నులు మాత్రమే ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్తు వంటి చర్యల వల్ల 2023 24 నాటికి రికార్డు స్థాయిలో 168.8 లక్షల టన్నులకు పెరిగిందని తెలిపారు.ప్రపంచ పటాలు పరిశీలించండి

### పరిమితులను అధిగమించండి

పరిమితులను, ఆటంకాలను సమస్యలుగా భావించి ఆగిపోవద్దని, వాటిని అవకాశాలుగా మలచుకోవాలని కేటీఆర్ విద్యార్థులకు సూచించారు. నిరంతరం నేర్చుకోవడం, నైపుణ్యాలను మెరుగుపరుచు కోవడం, వాటిని ఆచరణలో పెట్టడంపైనే దృష్టి సారించాలని యువతకు ఉద్బోధించారు. తెలంగాణ అభివృద్ధి కథను దేశ యువతకు తెలియజేసే అవకాశం కల్పించినందుకు ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు, మేధావులతో ఆలోచనలు పంచుకోవడానికి వేదిక కల్పించిన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ సీ రాజ్‌కుమార్‌కు, యాజమాన్యానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రసంగం అనంతరం జరిగిన ప్రశ్నోత్తరాల సెషన్‌లో విద్యార్థులు విధాన రూపకల్పన, రాజకీయాలు, అభివృద్ధి చెందుతున్న సరికొత్త టెక్నాలజీలపై వేసిన ప్రశ్నలకు ఆయన విశ్లేషణాత్మకంగా సమాధానాలు ఇచ్చారు.

### సభలో విశేష స్పందన

విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో కేటీఆర్ సమాధానాలు, ఆయన వాగ్ధాటి విశేషంగా ఆకట్టుకున్నాయి. దేశ రాజకీయ భవిష్యత్తు, ప్రాంతీయ ఆకాంక్షలు, పారిశ్రామిక అభివృద్ధిపై ఆయన వ్యక్తం చేసిన లోతైన అభిప్రాయాలకు విద్యార్థులు, అధ్యాపకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. దాదాపు గంటకు పైగా సాగిన ఈ చర్చా కార్యక్రమంలో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ ఆయన ఉత్సాహపరిచారు.

## అమెరికాలో హైదరాబాద్ యువకుడి ఆకస్మిక మృతి

నిద్రలోనే కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం

మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు సాయం కోరుతున్న కుటుంబం

విషయంలో జోక్యం చేసుకోవాలని కేంద్ర మంత్రి జైశంకర్‌కు విజ్ఞప్తి

కుటుంబానికి అండగా నిలవాలని న్యూయార్క్ కాన్సులేట్‌కు ఎంపీ లేఖ

త్రినేట్ న్యూస్, సెప్టెంబరు17

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఓ హైదరాబాదీ యువకుడు అక్కడ ఆకస్మికంగా మృతి చెందాడు. నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన మహమ్మద్ జాబేర్ హుస్సేన్ (27), అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రం లోవెల్ నగరంలో ఈ నెల 14న మృతి చెందాడు. జాబేర్ 2021లో సివిల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ కోసం అమెరికా వెళ్లాడు. కనెక్టికట్‌లో చదువు పూర్తి చేసి లోవెల్‌లో ఉద్యోగంలో చేరాడు. గత నెల ఆగస్టులోనే టెక్సాస్‌లో ఆయనకు వివాహం జరిగింది. సెప్టెంబర్ 14న ఉదయం తన తల్లితో ఫోన్‌లో మాట్లాడినప్పుడు జాబేర్ ఆరోగ్యంగానే ఉన్నాడని ఆయన తండ్రి జాకీర్ తెలిపారు. అయితే, అదే రోజు సాయంత్రం జాబేర్ నిద్రలోనే మరణించినట్లు ఆయన భార్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.జాబేర్ మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు ఆయన కుటుంబం ఇబ్బందులు పడుతోంది. ఈ క్రమంలో వారు మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) అధికార ప్రతినిధి అమ్జెద్ ఉల్లా ఖాన్‌ను ఆశ్రయించారు. ఆయన ఈ విషయంపై కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. అమెరికాలోని భారత రాయబార కార్యాలయం ద్వారా మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని, వీలైతే అయ్యే ఖర్చులను భరించాలని కోరారు.మరోవైపు, హైదరాబాద్ ఎంపీ సైతం ఈ విషయంపై స్పందించి, న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్‌కు లేఖ రాశారు. జాబేర్ అంత్యక్రియల కోసం మృతదేహాన్ని హైదరాబాద్‌కు పంపేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, జాబేర్ మృతికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు



## పీడీఎస్ బియ్యం కేసులో బేరం..

### ఏసీబీకి చిక్కిన ఇన్‌స్పెక్టర్, సబ్-ఇన్‌స్పెక్టర్

కీసరలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీఐ, ఎస్ఐ

రూ.5 లక్షలు స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ

పీడీఎస్ బియ్యం కేసులో మొత్తం రూ.8.5 లక్షలు డిమాండ్

ఏసీబీని చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన ఎస్ఐ

ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసి విచారిస్తున్న అధికారులు


త్రినేట్ న్యూస్, సెప్టెంబరు17

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసరలో రేషన్ (పీడీఎస్) బియ్యం అక్రమ రవాణా కేసులో నిందితుడి నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు పోలీసు అధికారులు పట్టుబడ్డారు. కీసర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ఆంజనేయులు, సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) జ్ఞానేందర్ రెడ్డి ఓ అక్రమ బియ్యం వ్యాపారి నుంచి రూ. 5 లక్షలు లంచం తీసుకుంటుండగా నిన్న అర్ధరాత్రి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు.వివరాల్లోకి వెళితే.. 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడిన కేసుకు సంబంధించి నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు సీఐ ఆంజనేయులు రూ. 10 లక్షలు డిమాండ్ చేశారు. చివరకు రూ. 8.5 లక్షలకు ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా, ఈ నెల 2వ తేదీన ఫిర్యాదుదారుడి నుంచి మొదటి విడతగా రూ. 3.5 లక్షలు తీసుకున్నారు. మిగిలిన రూ. 5 లక్షల కోసం వారు ఒత్తిడి చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు.పక్కా వ్యూహంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, కీసర పెద్దమ్మ చెరువు సమీపంలో బాధితుడి నుంచి సీఐ, ఎస్ఐ నగదు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులను గమనించిన ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా, అధికారులు వెంబడించి మరీ అతడిని పట్టుకున్నారు. అనంతరం ఇద్దరు అధికారులు కెమికల్ పరీక్షలకు సహకరించేందుకు నిరాకరించినట్లు సమాచారం. నిందితులిద్దరిని అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన రక్షక భటులే ఇలా లంచం తీసుకుంటూ పట్టుబడటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.



## గతేడాది ఒక్క రాయి దాడి కూడా లేదు..

### జమ్మూకశ్మీర్‌పై రక్షణ శాఖ ఆసక్తికర నివేదిక..




త్రినేట్ న్యూస్, సెప్టెంబరు17

జమ్మూకశ్మీర్‌లో 2025 సంవత్సర భద్రతా పరిస్థితిపై కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ కీలక గణాంకాలను వెల్లడించింది. రక్షణ మంత్రిత్వ శాఖ 2025-26 వార్షిక నివేదిక ప్రకారం, గతేడాది జమ్మూకశ్మీర్‌లో రాళ్లు రువ్విన ఘటనలు ఒక్కటి కూడా నమోదు కాలేదు. అదే సమయంలో స్థానిక యువతలో ఉగ్రవాద సంస్థల్లో చేరిన వారి సంఖ్య కేవలం ఒక్కరికి పడిపోయింది స్థానిక యువత ఉగ్రవాదంలో చేరే సంఖ్య గత కొన్నేళ్లుగా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. 2021లో 146 మంది, 2022లో 121 మంది ఉగ్రవాదంలో చేరగా.. 2023లో ఈ సంఖ్య 19కి, 2024లో నాలుగుకు తగ్గింది. 2025లో మాత్రం ఒక్క స్థానిక యువకుడు మాత్రమే ఉగ్రవాదంలో చేరినట్లు నివేదిక పేర్కొంది. స్థానిక యువత హింస మార్గాన్ని వదిలి ప్రభుత్వ సంక్షేమ, ఉపాధి కార్యక్రమాల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది జమ్మూకశ్మీర్‌లో గతంలో భద్రతా దళాలపై, నిరసనకారులు తరచుగా రాళ్ల దాడికి పాల్పడే వారు. అయితే గతేడాది మాత్రం అలాంటి ఘటన ఒక్కటి కూడా జరగలేదు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2010-14 మధ్య ఏటా సగటున సుమారు 2,654 రాళ్లు రువ్వే ఘటనలు నమోదయ్యేవి. 2022 తర్వాత ఇవి దాదాపు సున్నా స్థాయికి చేరుకున్నాయి. 2025లో నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదుల చొరబాటుకు సంబంధించి ఆరు ప్రయత్నాలు జరిగినట్లు నివేదిక తెలిపింది. భద్రతా బలగాలు ఈ ప్రయత్నాలన్నింటినీ అడ్డుకున్నాయి. ఈ క్రమంలో 12 మంది పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు హతమైనట్లు నివేదిక పేర్కొంది ఇక, జమ్ముకశ్మీర్ పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్నట్టు కూడా తాజా నివేదిక వెల్లడించింది (ణవటవఅషెవ వీఱఅఱర్‌తీఎ తీవజూశీతీ). 2025లో జమ్మూకశ్మీర్‌కు 2.3 కోట్ల మంది పర్యాటకులు వచ్చినట్లు నివేదిక పేర్కొంది. ఇందులో 4.13 లక్షల మంది అమర్‌నాథ్ యాత్రికులు ఉన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి జరిగినప్పటికీ పర్యాటకుల సంఖ్య పెరగడం గమనార్హమని నివేదిక పేర్కొంది.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136